క్లుప్తంగా

11న పోషకాహారంపై అవగాహన సదస్సు

తెనాలి: వాకర్స్ క్లబ్, తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో పోషకాహార అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. బెంగళూరులో బీఎస్సీ (న్యూట్రిషన్) చేసి, కువైట్‌లో రెండేళ్లు ఉద్యోగం చేసి వచ్చిన వెల్‌నెస్ కోచ్ నయాబ్ రసూల్ ఈ సదస్సులో పోషకాహారంపై అవగాహన కల్పిస్తారు. ప్రతివారు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించటానికి తీసుకోవాల్సిన ఆహార నియమాలను వివరిస్తారని వాకర్స్ క్లబ్, తెనాలి అధ్యక్ష, కార్యదర్శులు గుత్తా వెంకటరత్నం, కడియాల రవిబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ



తెనాలి టౌన్: రూరల్ మండలం కొలకలూరులోని ఆర్‌సీఎం చర్చిలో బుధవారం సంఘంలోని వృద్ధులకు విన్సెంట్ డీ పాల్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సొసైటీ ప్రెసిడెంట్ మల్లవరపు బుల్లయ్య, జూబ్లీ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ లీమా, సిస్టర్ విజీలియా వృద్ధులకు బియ్యం, ఆయిల్, పప్పులు, సబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా బుల్లయ్య మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏడాది నిత్యావసర వస్తువులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ ఆరంబాక రవి, కోశాధికారి వేమూరి రాజీ, ఉపాధ్యక్షుడు గొరికపూడి ఆంథోన్, సభ్యులు రావూరి శ్రీకాంత్, మల్లవరపు నరేంద్ర, రావూరి రవిబాబు, సారమేకల బాలయోగి పాల్గొన్నారు.

10న ఏసురత్నం సంస్మరణ సభ

తెనాలి: ప్రతిఘటనోద్యమ రథసారథి కనపర్తి ఏసురత్నం స్మృతి సంస్మరణ సభను ఈనెల 10వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు గుంటూరులోని ఏసీ కాలేజీలో గల జేడీ శీలం ఫంక్షన్ హాలులో జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలియజేశారు. దళిత ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ చల్లపల్లి స్వరూపరాణి, విశిష్ట అతిథులుగా విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి, మచిలీపట్నం పోర్టు ఎండీ మేకతోటి దయాసాగర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, తెనాలి కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారని వివరించారు.

రేపటి నుంచి దయానంద సరస్వతి జయంత్యుత్సవాలు

తెనాలి టౌన్: రూరల్ మండలం నందివెలుగులోని మహర్షి దయానంద వృద్ధాశ్రమంలో ఈ నెల తొమ్మిది నుంచి 11 వరకు ఆర్య సమాజ స్థాపకులు మహర్షి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు కొర్రపాటి రవీంద్రనాథ్, గుగ్గిలం రామమోహనరావు బుధవారం తెలిపారు. తొమ్మిదో తేదీ ఉదయం యజ్ఞం, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆర్య ప్రతినిధి సభకు చెందిన ఆచార్య హరిప్రసాద్ (అమెరికా), వేద ధర్మ ప్రచారకులు డాక్టర్ ధర్మతేజ ప్రసంగిస్తారని, సాయంత్రం ఐదు గంటలకు యజ్ఞం జరుగుతుందని పేర్కొన్నారు. 10న యజ్ఞం అనంతరం ఆధ్యాత్మిక ప్రసంగాల్లో భాగంగా ఆచార్య హరిప్రసాద్, ఆర్య సమాజం అధ్యక్షుడు మాగం కృష్ణమూర్తి ప్రసంగిస్తారని చెప్పారు. సాయంత్రం నందివెలుగులో శుభయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11న ఉదయం పూర్ణాహుతి అనంతరం యజ్ఞాన్ని ఆచార్య విశ్వనాథ్ నిర్వహిస్తారని చెప్పారు. సామూహిక యజ్ఞంలో పాల్గొనే దంపతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి



కొల్లిపర: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న దేశవ్యాప్తంగా జరగనున్న గ్రామీణ బంద్‌లో కార్మికులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. కొల్లిపర పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం కార్మికులకు బంద్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితంగా ప్రతి రోజు 30 మంది రైతులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి కోట చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చి వేశారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

చకచకా కులగణన

- తెనాలిలో చివరి దశకు చేరిన సర్వే
- ఇప్పటి వరకు 89 శాతం పూర్తి
- మిగిలిన 12శాతం పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు
- సహకరించాలని అధికారుల వినతి



తెనాలి పట్టణంలో కుల గణన సర్వే చేస్తున్న ఉద్యోగులు

తెనాలి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన తెనాలిలో చివరి దశకు చేరింది. గత నెల 10న ప్రారంభించారు. ఇప్పటి వరకు పట్టణంలో 89 శాతం గణన పూర్తి చేశారు. ఈనెల 12వ తేదీతో ఇది ముగియనుంది. పట్టణంలో 55,715 కుటుంబాలు ఉన్నాయి. వీటిల్లో 1,57,703 మంది ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పట్టణంలో వలంటీర్లు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు కులగణన చేపట్టారు. ఇప్పటి వరకు మొత్తం 49,569 నివాస గృహాల్లో నివసించే 1,31,191 మంది సర్వేను పూర్తి చేశారు. మిగిలిన వాటిని చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కులగణన వల్ల ఉపయోగాలు ఇవి

కులాల వారీగా జనాభా, ప్రస్తుత ఆర్థిక, సామాజిక పురోభివృద్ధి తెలుసుకోవచ్చు.గుర్తింపుకు నోచుకోని కులాలకు సముచిత స్థానం కల్పించేందుకు ఇది దోహదపడనుంది. ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు రూపొందించే అవకాశం ఉంది. సామాజిక న్యాయాన్ని సాధించి, సమసమాజాన్ని స్థాపించడానికి కులగణన ఉపయోగపడనుంది. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందుకోని వారికి వాటిని అందించే అవకాశం ఏర్పడనుంది.

అక్కడక్కడా సర్వేకు నిరాకరణ

పట్టణంలోని కొన్ని సామాజిక వర్గాలు నివసించే ప్రాంతాలలో సర్వే బృందాలకు నిరాశ ఎదురవుతోంది. కొన్ని అపార్ట్‌మెంట్లలో బృందాలను లోనికి రాకుండా అడ్డుకుంటున్నారు. అంతేకాకుండా కొందరు తమ వివరాలు తెలియజేసినా వేలిముద్రలు వేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో సర్వే బృందాలు వారిని ఒప్పించేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది.

కులగణన అభినందనీయం



దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టింది. సుమారు 73 సంవత్సరాల తర్వాత ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే దీన్ని చేపట్టారు. కులగణన వల్ల సంక్షేమ పథకాలు ఆగిపోతాయనే అపోహను కొందరు సృష్టిస్తున్నారు. వాటిని ఎవరూ నమ్మవద్దు. నూరుశాతం కులగణన జరిగే విధంగా పట్టణవాసులు సహకరించాలి. ఇంతటి బృహత్తర కార్యక్రమం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–తాడిబోయిన రాధిక, చైర్‌పర్సన్, తెనాలి పురపాలక సంఘం

అపోహలు వీడి సర్వేకు సహకరించండి



తెనాలి పట్టణంలో కులగణన సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. ఇందు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. అపార్ట్‌మెంట్లలో నివసించే కొందరు సర్వేకు సహకరించడం లేదని తెలిసింది. దీనివల్ల ఎటువంటి నష్టం జరగదు. అపోహలు వీడి సహకరించాలి.

–బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

నెహ్రూ నికేతన్ విద్యాసంస్థ స్వర్ణోత్సవ వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: స్థానిక నెహ్రూ నికేతన్ విద్యాసంస్థ స్వర్ణోత్సవ వేడుకలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ యాభై వసంతాల సుదీర్ఘకాలంలో లక్ష మంది విద్యార్థులకు బోధన చేయడం వెనుక సంస్థ యాజమాన్యం, ఉపాధ్యాయవర్గం, సిబ్బంది అంకితభావం ఉందన్నారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ స్వయం క్రమశిక్షణకు విలువనిచ్చే నెహ్రూ నికేతన్ విద్యా సంస్థ పట్టణానికి గర్వకారణమన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థులు అంతర్జాతీయస్థాయిలో విస్తరించారని చెప్పారు. మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న అధునాతన మార్పులను ఎప్పటికప్పుడు ముందుగా అందిపుచ్చుకుంటున్నట్టు చెప్పారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ ప్రగతి నివేదికను చదివారు. కార్యక్రమాన్ని విద్యాసంస్థ వ్యవస్థాపకుడు డి.వి. ప్రకాశరావు పర్యవేక్షించారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అభినందనలు అందుకున్నాయి.

నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో శిల్ప, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, వైద్యులు

తెనాలి టౌన్: జిల్లావ్యాప్తంగా ఈ నెల తొమ్మిదిన జరిగే జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం తెలిపారు. కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పోస్టర్లను ఆయనతో పాటు ఎంపీడీవో కె.శిల్ప, పలువురు వైద్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి సుబ్బరాయణం మాట్లాడుతూ ఒకటి నుంచి 19 సంవత్సరాల్లోపు వయస్సున్న అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కొలకలూరు, సంగంజాగర్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సీహెచ్‌వి.సుబ్బారావు, డాక్టర్ దిలీప్, డాక్టర్ అనీఫ్, డివిజన్ సహాయ మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి, పట్టణ సబ్ యూనిట్ మలేరియా అధికారులు కె.ఉమాకాంత్, వి.పున్నారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి రాజయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు వెంకటరెడ్డి, దీపాల శ్రీనివాసరావు, కమిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లిపరలో..



కొల్లిపరలో మాత్రలను ఉపాధ్యాయులకు అందిస్తున్న ఎంపీపీ పద్మావతి

రాష్ట్ర ప్రభుత్వం నులిపురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ఈనెల 9న నిర్వహించే కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సభలో వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ఆరోగ్య సిబ్బందికి మాత్రలు పంపిణీతో పాటు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ మండలంలోని 4,652 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేసి నూరు శాతం లక్ష్యాన్ని సాధించి, జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉండాలని తెలిపారు. మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ , డాక్టర్ వి.ప్రియాంక మాట్లాడుతూ 1 నుండి 2 సంవత్సరాల్లోపు పిల్లలకు సగం ట్యాబ్లెట్ , 3 నుంచి19 సంవత్సరాల లోపు పిల్లలకు పూర్తిగా మధ్యాహ్నం భోజనం తరువాత మింగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, ఎంఈవో 1, 2 సాల్మాన్‌రాజ్, ఝాన్సీలత, ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

11న బాల మేధావి చేతన భగవద్గీత పారాయణ

వల్లభాపురం(తెనాలి): కొల్లిపర మండలం వల్లభాపురంలోని శ్రీవినాయకస్వామి దేవాలయం 112వ వార్షికోత్సవాల్ని ఈనెల 10, 11 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నట్టు ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 11వ తేదీ ఉదయం 11 గంటలకు దేవాలయ ఆవరణలో భీమవరానికి చెందిన బాలమేధావి బొలిశెట్టి చేతన భగవద్గీత పారాయణ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పటికే పలు దేవాలయాల్లో శతాధిక పారాయణాలు చేసిన చేతన కార్యక్రమాన్ని పిల్లలు తిలకించి స్ఫూర్తిని పొందాలని ఆయన సూచించారు. తొలిరోజైన 10వ తేదీన ఉదయం 10 గంటలకు వేద ప్రచారకులు గొడవర్తి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విశ్వశాంతి యజ్ఞం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య శిబిరం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



కొల్లిపర: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలపై ఓటర్లు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు సూచించారు. మండల పరిధిలోని మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో అధికారులు బుధవారం వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించారు. ఈవీఎంలు పనిచేసే విధానం, ఓటు వేయడం, తాము ఏ గుర్తుపై ఓటు వేసింది తెలుసుకోవడాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, ఓటర్లు పాల్గొన్నారు.

రత్నాకర్‌కు అవార్డు

తెనాలి: పట్టణానికి చెందిన దర్శకుడు కనపర్తి రత్నాకర్ తెలుగు సినిమా లెజండరీ మెమోరియల్ అవార్డును స్వీకరించారు. నేస్తం ఫౌండేషన్, తెలుగు సినిమా వేదిక సంయుక్తంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో మంగళవారం రాత్రి తెలుగు సినిమా పుట్టినరోజు వేడుకల్ని ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా సినీ రంగంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరచిన వారికి తెలుగు సినిమా లెజండరీ మెమోరియల్ అవార్డుల్ని ప్రదానం చేశారు. ప్రముఖ నిర్మాత ఏ.ఎం. రత్నం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు జె.వి.మోహనగౌడ, పి.విజయేంద్రవర్మ, హాస్య నటులు బాబూమోహన్, చిట్టిబాబు, కథానాయకి కవిత, నటి శివపార్వతి పాల్గొన్నారు.


ఉద్యోగాలకు 31మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ

తెనాలి అర్బన్: గుంటూరుకు చెందిన ఇంగ్లిషు ఫర్ యూ సంస్థ ఆధ్వర్యంలో జేఎంజే కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 31 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ తెలిపారు. మొత్తం 174మంది విద్యార్థులు పాల్గొన్నారని, వారికి గ్రూపు డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించి 31మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థినులకు ఇంగ్లిష్ భాషపై శిక్షణ ఇచ్చి పలు కళాశాలలు, విద్యాసంస్థల్లో సేవల్ని సంస్థ ఉపయోగించుకోనున్నట్లు వివరించారు. వీరికి ప్రతి నెలా వేతనం కూడా ఇస్తారన్నారు. ఎంపికైన విద్యార్థినుల్ని అభినందించారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ ఫర్ యూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.ప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ వి.ఈశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.సుధాకరయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు



గుంటూరు ఈస్ట్: హత్య కేసులో ఇద్దరు నిందితులను నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ నరేష్‌లు బుధవారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శ్రీనివాసరావుతోటలో మంగళవారం షేక్ మహబూబ్ సుభానీని అతని తల్లి జరీనాబేగం, ఆమె ప్రియుడు షేక్ చిన్నబాజీ కలిసి రోకలి బండతో కొట్టి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు బుధవారం షేక్ చిన్నబాజీ, జరీనాబేగంలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ హత్య జరిగిన 24 గంటల్లోపు నిందితులను అరెస్టు చేయడానికి కృషి చేసిన ఎస్‌హెచ్‌ఓతో పాటు, సిబ్బందిని అభినందించారు.

జగనన్న సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా



సురక్ష క్యాంపును పరిశీలిస్తున్న చైర్మన్ రాధిక, వైస్ చైర్మన్ హరిప్రసాద్, కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్:పేదల ఆరోగ్యానికి జగనన్న సురక్ష మెడికల్ క్యాంపులు ఎంతో భరోసా కల్పిస్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 13వ వార్డు చినరావూరులోని కమ్యూనిటీ హాలులో బుధవారం జగనన్న సురక్ష రెండో విడత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు సేవలు అందించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు శ్రీరామ రక్ష వంటిదని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ కింద రూ.5 నుంచి రూ.25లక్షల వరకు కార్పొరేట్ వైద్యం అందించే విధంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ పేదల సంక్షేమానికి, ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. 13వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కుర్రా సుజాత మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేద ప్రజల ఆర్థిక అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సురక్ష మెడికల్ క్యాంప్‌లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తిరుమలలో హరినామ సంకీర్తనల ఆలాపన



సంకీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

తెనాలి టౌన్: తిరుమలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో తెనాలికి చెందిన మహిళలు హరినామ సంకీర్తనలు ఆలపించినట్లు శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆదేశాల మేరకు శ్రీ సాయిరామ్ సంగీత లహరి, కోలాట భజన మండలికి చెందిన మహిళలు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. సంకీర్తనలు ఆలపించిన వారిలో బృంద కన్వీనర్ వసుంధర, వి.లక్ష్మీ సునీత, జాహ్నవి, ఉమామహేశ్వరరావు, గంగిశెట్టి నాగలక్ష్మి, సుధ, వెలగలేటి వాణి, భాగ్యలక్ష్మి, మేడ పద్మావతి, పార్వతి ఉన్నట్లు చెప్పారు.

జిల్లాస్థాయిలో వైష్ణవి విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

తెనాలి టౌన్: గుంటూరులోని హిందూ కళాశాలలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్, వక్తృత్వ పోటీల్లో తెనాలి వైష్ణవి కాలేజీకి చెందిన విద్యార్థులు బహుమతులు సాధించారు. క్విజ్ పోటీలో షేక్ ఖాదర్ షరీఫ్, బి.మణి సుబ్బారావు, ఎల్.లింగేశ్వరరెడ్డి ప్రథమస్థానం సాధించారు. వక్తృత్వ పోటీల్లో సీహెచ్.దుర్గాలక్ష్మి, వి.కమల నైనీలు ద్వితీయ స్థానం సాధించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హిందూ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసాద్, వైష్ణవి కాలేజీ అధ్యాపకులు బాబు పాల్గొన్నారు. క్విజ్, వక్తృత్వ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులను వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు అభినందించారు.

మతవాదులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న అబ్రహాం లింకన్

తెనాలి: ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపక కార్యదర్శి, కవి డాక్టర్ కత్తి పద్మారావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొందరు మతవాదులను కఠినంగా శిక్షించాలని వివిధ సంస్థల నాయకులు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ సేవాట్రస్ట్, జైభీమ్ ఫెడరేషన్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక నాయకులు బుధవారం రాత్రి సేవాట్రస్ట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక టీవీ చానల్, యూట్యూబ్ చానల్‌లోను కరుణాకర్, లలితకుమార్, హమారా ప్రసాద్‌లు డాక్టర్ కత్తి పద్మారావు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానకరంగా సంబోధించారని ఆరోపించారు. దీనిపై స్థానిక డీఎస్పీని కలిసి, పై ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు పెట్టాలని ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు కనపర్తి అబ్రహాం లింకన్, దూబా సందీప్, పాముల దాసు, చేబ్రోలు కిషోర్, కఠెవరపు దేవయ్య, బేతాళ భూషణం, రమేష్, రవీంద్ర, బ్రూస్లీ, ఎజ్రా, పిల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి టీ-20 క్రికెట్ చాంపియన్‌షిప్

తెనాలి: జనాబ్ అబ్దుల్ సత్తార్‌ఖాన్ మెమోరియల్ రాష్ట్రస్థాయి 3వ టీ-20 క్రికెట్ చాంపియన్‌షిప్ ఈనెల 9నుంచి తెనాలిలో నిర్వహించనున్నారు. ఈ మేరకు పట్టణానికి చెందిన డాక్టర్ రియాజ్‌ఖాన్, యువ క్రికెట్ అకాడమీ కోచ్ మాలిక్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీ క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి క్రీడాకారులకు పురస్కారాలను ఇవ్వనున్నట్టు వివరించారు.

మట్టిపెళ్లల కింద ఆగిన ఊపిరి

- తెనాలిలో పైపులైను మరమ్మతులు చేస్తుండగా పడిన మట్టి పెళ్లలు
- మున్సిపల్ తాత్కాలిక కార్మికుడి మృతి



వెంకటేశ్వర్లు మృతదేహం

తెనాలి రూరల్: మంచినీటి పైపులైను మరమ్మతులు చేస్తుండగా మట్టి పెళ్లలు మీద పడి మున్సిపల్ తాత్కాలిక కార్మికుడు మృతి చెందిన సంఘటన స్థానిక ఐతానగర్ ఎస్‌బీఐ వద్ద బుధవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక బెరాకా చర్చి సమీపంలో మంచినీటి పైపులైను లీకేజీ అవుతుండటంతో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. వాటర్ పైపులైను లీకుల రిపేరు నిమిత్తం పొక్లెయిన్‌తో మట్టి తవ్వకాలు జరుపుతుండగా చుండూరు మండలం చినపరిమి గ్రామానికి చెందిన అయినంపూడి వెంకటేశ్వర్లు మీద మట్టి పెళ్లలు రెండుసార్లు వెంట వెంటనే పడటంతో మట్టిలో పూడుకుపోయాడు. మీద మట్టిపెళ్లలు పడటంతో ఊపిరి ఆడక సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వెంకటేశ్వర్లుతో పాటు పనిచేస్తున్న వరికుంట ఏసుదాసుకు గాయాలు కాగా ప్రాణాలతో బయటపడ్డాడు. అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్వర్లు పరిస్థితి చూసి స్థానికులు 108కి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొన్న అంబులెన్స్ సిబ్బంది తమ వంతు ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వెంకటేశ్వర్లు మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. అయినంపూడి వెంకటేశ్వర్లు తెనాలి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. టూ టౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళ్లముందే కూరుకుపోయాడు

వాటర్ పైపులైను లీక్ అవుతుండటంతో ఉదయం పనులు నిమిత్తం పొక్లెయిన్‌తో గుంట తవ్వుతుండగా కిందకి దిగి తామంతా సరి చేసే క్రమంలో మట్టి పెళ్లలు ఒక్కసారిగా వెంకటేశ్వర్లుపై పడటంతో తాము తొలగించే ప్రయత్నం చేస్తుండగా మరోసారి పడటంతో తమ కళ్లముందే మట్టిలో కూరుకుపోయాడని, ఎంత ప్రయత్నించినా లాగలేకపోయామని తోటి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్, కమిషనర్ బి. శేషన్న ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వెంకటేశ్వర్లుకు తక్షణ సాయం కింద రూ. 25 వేలు అతని కుటుంబసభ్యులకు అందజేశారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని తెలిపారు. బీజేఆర్ కమిటీ నాయకులతో పాటు, మాదిగ దండోరా రాష్ట్ర నాయకులు ఘటనాస్థలానికి చేరుకుని వెంకటేశ్వర్లు భౌతిక కాయాన్ని సందర్శించారు. తమ వంతుగా కొంత ఆర్థిక సాయం చేశారు.